క్లుప్తంగా

5న ప్రవేశ పరీక్ష

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఈనెల 5న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రభుజ్యోతి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు మండల కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పీఆర్సీ కమిటీని నియమించాలి

ఆదిలాబాద్‌అర్బన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వేతన సవరణ కాలపరిమితి ముగిసినందున వెంటనే పీఆర్సీ కమిటీని నియమించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శశికాంత్, జి.బాపురావు ప్రకటనలో కోరారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, నగదు రహిత వైద్యం అందించాలన్నారు.

నిందితుడిని ఉరి తీయాలి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

నార్నూర్: వైద్య విద్యార్థి ప్రీతి మృతికి కారణమైన నిందితుడిని ఉరి తీయాలని మండలంలోని ఖంపూర్ గ్రామం నుంచి మహాగావ్ వరకు ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ శ్రీనివాస్, సర్పంచ్ ఆనందరావుల ఆధ్వర్యంలో విద్యార్థులు, గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, శిక్ష పడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ యాదవ్‌రావు, ఉపాధ్యాయులు జగన్నాథ్, రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐకేపీ ఏపీఎంగా రాథోడ్ ఉత్తం

నేరడిగొండ: నేరడిగొండ ఐకేపీ ఏపీఎంగా రాథోడ్ ఉత్తం గురువారం మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు కుమారి క్లస్టర్ సీసీ పని చేస్తున్న లింగమయ్యకు ఇన్‌చార్జి ఏపీఎంగా బాధ్యతలు అప్పగించడంతో ఏపీఎంగా కొనసాగారు. కుమురం భీం జిల్లాలోని చింతలమానేపల్లి మండలం నుంచి రాథోడ్ ఉత్తం బదిలీపై వచ్చారు. మండల సమైఖ్య అధ్యక్షురాలు వనజ, సీసీలు, వీవోఏలు, సిబ్బంది ఆయనను సన్మానించారు.

మాదిగల అస్తిత్వం కోసమే పాదయాత్ర

గుడిహత్నూర్: మాదిగల అస్తిత్వం కోసమే పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు రామంచల లక్ష్మణ్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు చేపట్టి చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా సంగ్రామ యాత్ర చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ చేపట్టిన పాదయాత్ర నేడు మండల కేంద్రానికి చేరుకుంటుందన్నారు. ఆయన వెంట రాథోడ్ రోహిదాస్, తబ్రేజ్‌ఖాన్ ఉన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని పంచాయతీరాజ్ ఈఈ మహావీర్ అన్నారు. గురువారం మండలంలోని తోయగూడ, మారుతిగూడ, వాల్గొండ, ఏమాయికుంట, దస్నాపూర్ గ్రామాలను సందర్శించి సీసీ రోడ్డు, కల్వర్టు పనులను పరిశీలించారు. మూల మలుపుల వద్ద పటిష్టంగా సిమెంట్ రోడ్డు నిర్మించాలని సూచించారు. పనుల్లో జాప్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈ రమేష్, ఏఈ లింగన్న, నాయకులు ఆర్క ఖమ్ము పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే ఆత్రం సక్కు జన్మదిన వేడుకలు

నార్నూర్: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు జన్మదిన వేడుకలను గురువారం నార్నూర్, గాదిగూడ ఉమ్మడి మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సమక్షంలో కేక్‌కట్ చేశారు. విద్యార్థులకు ఉచితంగా 50 బెంచీలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, మెస్రం హన్మంతరావు, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, తొడసం నాగోరావు, తదితరులు పాల్గొన్నారు.

గొంతు తడపని 'భగీరథ'

- ఎక్స్‌రోడ్డు కాలనీవాసులకు తప్పని తిప్పలు
- పంచాయతీ బోరుపైనే ఆధారం
- పట్టించుకోని అధికారులు



గ్రామ పంచాయతీ బోరు



గుడిహత్నూర్ ఎక్స్‌రోడ్డు కాలనీ

గుడిహత్నూర్: ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. కానీ గ్రామాలకు మాత్రం తాగునీరు సరఫరా కావడం లేదు. మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డు కాలనీవాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొన్ని ఏళ్ల నుంచి రోడ్లను తవ్వి, పైపులు వేసి, మిషన్ భగీరథ నల్లాల కనెక్షన్లు ఇచ్చారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. క్షేత్రస్థాయిలో చిన్న చిన్న కారణాలతో భగీరథ నీరు అందడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్న 50 కుటుంబాలు

మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44పై ఎక్స్ రోడ్డుపై ఎడమ పక్కన సర్వీసు రోడ్డుకు ఆనుకొని ఉన్న సుమారు 50 కుటుంబాలకే మిషన్ భగీరథ నీరు అందడం లేదు. కారణాలు ఏవైనా.. గ్రామ పంచాయతీ వేయించిన బోరు బావిపైనే ఆధారపడి తామ అవసరాలు తీర్చుకుంటున్నారు. మరి కొందరు వారి వారి ఇళ్లలో ఉన్న బావులపై ఆధారపడుతున్నారు. బోరు మోటారు పాడైతే ఇబ్బందులు అంతా ఇంతా కాదు. అయినా.. అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

అసలు సమస్య ఏంటి..

మండల కేంద్రంలోని జాతీయ రహదారికి ఎడమ పక్కన సుమారు 50 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కుడిపక్క వందలాది కుటుంబాలు నివసిస్తున్నాయి. భగీరథ పనులు కుడి పక్కన పూర్తిచేసిన అధికారులు, ఎడమ పక్కన సర్వీసు రోడ్డును ఆనుకొని ఇళ్ల సముదాయాలకు మాత్రం విస్మరించారు. సర్వీసు రోడ్డు ఉండడం, పక్కనే ఇళ్ల సముదాయాలు ఉండడంతో పైపులైన్ వేయాలేక పోతున్నామని గతంలో కాంట్రాక్టర్, అధికారులు చెప్పుకొచ్చారు. దీంతో భగీరథ నీరు అందని ద్రాక్షగా మిగిలింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటిని అందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



నీటి కొరత కారణంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. పశువులకు నీరు పెట్టేందుకు కష్టమౌతోంది. ఎండకాలం ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే మే నెలలో ఎలా ఉంటుందో ఊహించుకుంటే భయమేస్తోంది.

– చట్ల ప్రకాశ్‌రెడ్డి, ఎక్స్‌రోడ్, గుడిహత్నూర్

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం

ఎక్స్ రోడ్డుకు భగీరథ నీరు రావడం లేదు అనేది వాస్తవమే. అక్కడ పనులు చేయాలంటే తిరిగి మంజూరు చేసుకోవాల్సిందే. ప్రస్తుతం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. లేదంటే కొత్త బోరు బావిని తవ్వించి నీటి ఎద్దడి లేకుండా చూస్తాం.

– ఆదిత్య, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్, గుడిహత్నూర్

ఎంఐఎం ఆవిర్భావ వేడుకలు



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కైలాస్‌నగర్: ఎంఐఎం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం కేక్‌కట్ చేసి, టపాసులు కాల్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంఐఎం ముందుండి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, షకీల్ అహ్మద్, షాహిద్ ఖాన్, మహమ్మద్ రోహిత్, షాహనవాజ్ హుస్సేన్, ఫైయాజ్ హష్మీ, తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే లక్ష్యం

ఇచ్చోడ: పేద ప్రజల అభివృద్ధే ఎంఐఎం లక్ష్యమని మండల అధ్యక్షుడు జావిద్ అహ్మద్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో ఉన్న పేదల సంక్షేమం కోసం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సోఫియన్, ఆరిఫ్, శేక్ సాజిద్, అబ్దుల్ గఫార్, నసీర్, అఫ్రోజ్ , హజీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న డిపో మేనేజర్ కల్పన

తలమడుగు: ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన అన్నారు. గురువారం మండలంలోని కజ్జర్లలో ప్రజల వద్దకే ఆర్టీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు అందిస్తున్న రాయితీల గురించి వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు కార్గో సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ తన్వీర్, యూసుప్, రమాకాంత్ పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తజనం



ఇచ్చోడ: మండలంలోని అతిపురాతన సిరిచెల్మ మల్లన్న జాతరకు గురువారం భక్తులకు పోటెత్తారు. గత ఐదు రోజుల క్రితం ప్రారంభమైన జాతర శుక్రవారం తెల్లవారు జామున ముగియనుంది. మల్లన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. చివరిరోజు ఆలయ ఆవరణలో అగ్నిగుండం ఏర్పాటు చేసి రథాల ఊరేగింపు అనంతరం జాతర ముగియనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బహుమతులు ప్రదానం



బహుమతి అందజేస్తున్న మనోహర్

బేల: మండలంలోని దహెగాం గ్రామ శివారులో తిరంగ యూత్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. గురువారం విజేతగా నిలిచిన కిన్వట్ (మహారాష్ట్ర) జట్టుకు రూ.61వేల నగదు, రన్నరఫ్ దహెగాం జట్టుకు రూ. 31వేల నగదును జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తాక్రే గంభీర్, సతీశ్ పవార్, వరాడే విఠల్, తన్వీర్‌ఖాన్, సాదిక్ పాల్గొన్నారు.

క్రీడలతోనే స్నేహభావం

కైలాస్‌నగర్: క్రీడలతోనే స్నేహభావం ఏర్పడుతుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్ రెడ్డి, సర్పంచ్ పాయల్ శరత్ అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కొత్తూరులో పాయల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు గురువారం ముగిశాయి. ఈసందర్భంగా గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్, పెండల్ వాడ ఉప సర్పంచ్ నరేశ్, భూపేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సన్మానం

ఆదిలాబాద్‌అర్బన్: నూతనంగా ఎన్నికైన ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ సభ్యులను డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ గురువారం ఆయన నివాసంలో సన్మానించారు. సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే జర్నలిస్టుల సేవలను గొప్పవని కొనియాడారు. కార్యక్రమంలో జర్నలిస్టులు షాహిద్ అహ్మద్, ఖిజర్ అహ్మద్, ఆసీఫ్ ఉద్దీన్, అఖిల్ అహ్మద్, బజార్‌హత్నూర్ జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య పాల్గొన్నారు.

కేజీబీవీ వసతి గృహం సందర్శన

ఉట్నూర్: మండల కేంద్రంలోని కేజీబీవీ వసతి గృహాన్ని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనంపై ఆరా తీశారు. బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. సిబ్బంది విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యను బోధించాలన్నారు. ఆయన వెంట మర్సుకోల తిరుపతి, తదితరులు ఉన్నారు.

కార్యవర్గం ఎన్నిక

తలమడుగు: మండలంలోని ఉండమ్ గ్రామంలో గురువారం బీసీ సంఘ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గంగారెడ్డి, అధ్యక్షుడిగా లచ్చన్న, ప్రధాన కార్యదర్శిగా సురేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాల్వ మహేశ్, ప్రచార కార్యదర్శిగా రవితేజ, కోశాధికారిగా సంతోశ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా షారూఫ్‌లను ఎన్నుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, కౌన్సిలర్లు ఆవుల వెంకన్న, వెనుగంటి ప్రకాష్, దయాకర్, మల్లయ్య పాల్గొన్నారు.

అలరించిన కళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల క్రీడా, వార్షికోత్సవ వేడుకలను గురువారం అట్టహాసంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సినీ, జానపద, దేశభక్తి గీతాలపై విద్యార్థులు డ్యాన్సులతో దుమ్మురేపారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డీఐఈవో రవీందర్, ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, కళాశాల ప్రిన్సిపల్ భగవాండ్లు, ప్రిన్సిపల్స్ జాదవ్ గణేష్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి: త్రిపుర, నాగలాండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో గురువారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ దీపక్‌సింగ్ షెకవత్, మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, దిలిప్ మోరే, మస్కే రాజువర్ధాన్, రాథోడ్ భీంరావ్, మెస్రం లచ్చు, గేడం భరత్ పాల్గొన్నారు.

బండి సంజయ్ పర్యటనకు ఏర్పాట్లు

ఆదిలాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఈనెల 4న ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రానున్నారు. దీంతో పట్టణంలోని జనార్దన్ రెడ్డి గార్డెన్‌లో సభ ఏర్పాట్లను గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పరిశీలించారు. ఆయన వెంట నాయకులు విజయ్ బోయర్, మహేందర్, తదితరులు ఉన్నారు.

'ఆలయాన్ని తరలిస్తే ఊరుకోం'



కలెక్టర్‌ను వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎదులాపురం: ఆదిలాబాద్‌రూరల్ మండలం చాందా(టి) బైపాస్ దగ్గరల్లోని హనుమాన్ ఆలయాన్ని వేరే చోటకి తరలిస్తే ఊరుకోమని హిందూవాహిని, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ సభ్యులు హెచ్చరించారు. గురువారం కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కొందరు రియల్ వ్యాపారులు తమ లేఅవుట్ల కోసం పురాతన ఆలయాన్ని తరలించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సాయి, రోహిత్, సాయికిరణ్, చాణిక్య, సుధీర్, గంద్రత్ నరేందర్, రోషన్, ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో ప్రణీత గురువారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను పరిశీలించారు. స్నాక్స్‌ను అందిస్తున్నారా? అనే దానిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రత్యేక బుక్‌లెట్‌లను సద్వినియోగం చేసుకుని పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఆయన వెంట సీసీ రాజేశ్వర్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ఆదిలాబాద్ రూరల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మామిడి గూడా ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ అన్నారు. గురువారం విద్యార్థుల హాజరు శాతం, అభ్యసన సామర్థ్యం, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, విద్యార్థుల డ్రాప్ అవుట్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్సీఈఆర్పీ నగేశ్, టీడబ్ల్యూపీఎస్ ప్రధానోపాధ్యాయులు స్వామిదాస్, బాలకిషన్, ఇస్తారి, సీతారాం పాల్గొన్నారు.

పేదల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం

- నిరసన కార్యక్రమాలు చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు



నేరడిగొండ: మాట్లాడుతున్న జెడ్పీటీసీ అనిల్ జాదవ్



బోథ్: నిరసన తెలుపుతున్న ఎంపీపీ తుల శ్రీనివాస్



తాంసి: మాట్లాడుతున్న నాయకులు

తాంసి: కేంద్ర ప్రభుత్వం సిలిండర్ ధరలను పెంచి పేదల నడ్డి విరుస్తుందని బీఆర్ఎస్ మండల కన్వీనర్ తారుడి అరుణ్ అన్నారు. గ్యాస్ సిలిండర్ ధర పెంచడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వాన్ని త్వరలోనే గద్దె దించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్ రెడ్డి, సదానంద్, రఘు, మహేందర్, ఉత్తం, ధనుంజయ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌ల ధర పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. గ్యాస్ ధర పెంపుతో పేద, మధ్య తరగతి ప్రజలపై భారం పడుతుందన్నారు. శుక్రవారం మహిళలతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. సమావేశంలో ఎంపీపీ రాథోడ్ సజన్, బీఆర్ఎస్ కన్వీనర్ శివారెడ్డి, సర్పంచ్‌లు వెంకట రమణ, జంగు, విశాల్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: పెంచిన సిలిండర్ ధరలను వెంటనే తగ్గించాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో సిలిండర్ ధరలను పెంచుతూ.. సామాన్యుల నడ్డి విరుస్తుందన్నారు. సమావేశంలో రాథోడ్ ప్రకాశ్, వెంకటేశ్, ముస్తాఫా, అర్గుల గణేష్, దాసరి భాస్కర్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: నిత్యావసర ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల నడ్డి విరుస్తుందని బీఆర్ఎస్ మండల కన్వీనర్ కానిందే రాజారాం విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ.. ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో పరచ సాయన్న, కవీందర్, చంద్రశేఖర్, లక్ష్మన్, నర్సారెడ్డి, ప్రకాష్, అంకుష్, మహబూబ్, సంజీవ్, తుల్సిరాం, జగదీష్, విలాస్, మధుకర్ పాల్గొన్నారు.

తలమడుగు: గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ వెంకటేశ్, అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రకాశ్, చంటి, శాస్త్రి, నర్సిహులు, వెంకన్న యాదవ్, మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

కైలాస్‌నగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై భారాన్ని మోపేలా వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.50 పెంచడం దుర్మార్గమని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్‌కుమార్ మండిపడ్డారు. గురువారం అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేదలకు మళ్లీ కట్టెల పొయ్యే దిక్కవుతుందన్నారు. సమావేశంలో నక్క రాందాస్, లింగంపల్లి ప్రసన్నకుమార్, కత్తి గంగాధర్, కొల్లూరు స్వామి పాల్గొన్నారు.

బోథ్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ. 50 పెంచి పేదల నడ్డీ విరుస్తుందని ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మహిళలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. నిత్యావసర ధరల పెంపుతో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రుక్మణ్ సింగ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు తాహెర్ బిన్ సలాం, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్ పాల్గొన్నారు.

నీటి సరఫరా పునరుద్ధరణ



పైపులైన్‌కు మరమ్మతు చేయిస్తున్న అధికారులు

నార్నూర్: మండలంలోని నాగల్‌కొండ గ్రామంలో తాగునీటి కోసం గ్రామస్తులు, మహిళలు ఖాళీ బిందేలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో మిషన్ భగీరథ డీఈఈ శ్రీనివాస్ గురువారం స్పందించారు. గ్రామాన్ని సందర్శించి ఏఈ సుభానీ పర్యవేక్షణలో భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేయించారు. ఆయన మాట్లాడుతూ.. ఎక్కడైనా నీటి సమస్యలు ఉంటే మిషన్ భగీరథ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899